సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

ఆదివారం । 9 । జూలై । 2023



నాయకుల అరెస్ట్.. విడుదల

ప్రధాని మోదీ నగర పర్యటన నేపథ్యంలో పలు విద్యార్థి సంఘాల నాయకులను, పలు పార్టీల నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. - 9లో



చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కావాలి - 9లో

ప్రధాని హయాంలోనే బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు రావాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాను సురేశ్ అన్నారు.

గరిష్టం/కనిష్టం
31.0° /25.0°

వాతావరణం

ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వర్షం కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కాజీపేట జంక్షన్‌కు కొత్త టీసీలు



కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌కు శనివారం కొత్తగా కొంత మంది రైల్వే టీసీలు వచ్చి విధులు నిర్వహించారు. ఇటీవల రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ ద్వారా నియామకమైన పలువురు ట్రెయినీ టికెట్ కలెక్టర్లు విధుల్లో చేరి రైలు దిగిన ప్రయాణికుల వద్ద టికెట్ కలెక్ట్ చేశారు. సీనియర్ టీసీలు కొత్తగా వచ్చిన వారి విధులకు సహకరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

విద్యారణ్యపురి: జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక కోసం ఆసక్తి, అర్హత కలిగిన ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకోవాలని శనివారం హనుమకొండ డీఈఓ ఎండీ అబ్దుల్‌హై ఒక ప్రకటనలో కోరారు. హెచ్‌టీటీపీ//నేషనల్ అవార్డ్స్‌టీచర్స్.ఎడ్యుకేషన్.గౌట్.ఇన్‌లో ఈనెల 15 వరకు అందుబాటులో ఉంటాయని అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు. కనీసం పదేళ్ల సర్వీస్ కలిగిన ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో పని చేస్తున్న ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు అర్హులని పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ సూచించారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బస్సు సౌకర్యం

హన్మకొండ: హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు హనుమకొండ నుంచి ఆర్టీసీ బస్ సౌకర్యం కల్పిస్తున్నట్లు వరంగల్–1 డిపో మేనేజర్ పి.శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 10వతేదీ నుంచి సూపర్ లగ్జరీ బస్సు నడుపనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈబస్సు రాత్రి 10 గంటలకు హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్ నుంచి బయల్దేరి ఉప్పల్, ఎల్బీనగర్ మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రాత్రి రెండు గంటలకు చేరుకుంటుందని తెలిపారు. తిరుగు ప్రయాణంలో ఉదయం 3 గంటలకు బయల్దేరి హనుమకొండకు 7 గంటలకు చేరుకుంటుందని వివరించారు. ఎయిర్ పోర్టుకు వెళ్లే ప్రయాణీకులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని డిపో మేనేజర్ పి.శ్రీనివాస్ కోరారు.

టీ9 టికెట్‌తో 12 గంటల ప్రయాణం

హన్మకొండ: టీ9 టికెట్‌తో ఇక నుంచి 12 గంటల పాటు ప్రయాణం చేయవచ్చని ఆర్టీసీ వరంగల్–1 డిపో మేనేజర్ పి.శ్రీనివాస్‌రావు తెలిపారు. పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణించే మహిళలు, వృద్ధుల కోసం టీ9 టికెట్ ప్రవేశపెట్టినట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. రూ.100 చెల్లించి తీసుకునే ఈ టికెట్‌ను ప్రస్తుతం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ప్రయాణించే సౌకర్యాన్ని కల్పించారు. దీన్ని ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రయాణించే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. అదే విధంగా టీ9 టికెట్‌కు అదనంగా రూ.20 చెల్లించి ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ ప్రయాణించే వెసులుబాటు కల్పించినట్లు పేర్కొన్నారు.

ఎంజేపీలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

విద్యారణ్యపురి: మహాత్మా జ్యోతిరావుపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పెంబర్తిలో నెలకొల్పిన స్టేషన్‌ఘన్‌పూర్ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో 2023–2024 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ చారి, కన్వీనర్ ఎం.అనిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థినులు బీకామ్ (బిజినెస్ అనలిస్ట్), బీకాం (సీఏ), బీఎస్సీ (ఎంపీసీ), బీఎస్సీ (ఎంపీసీఎస్), బీఎస్సీ (ఎంఎస్‌సీఎస్), బీఎస్సీ (బీజెడ్‌సీ), బీఏ (ఈపీహెచ్) కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని వారు కోరారు. పూర్తి వివరాలకు (98666 10429), (79934 56814) నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

రైళ్ల రద్దు పొడిగింపు

కాశిబుగ్గ: సికింద్రాబాద్, కాజీపేట, విజయవాడ సెక్షన్ పరిధిలో జరుగుతున్న రైల్వే మూడో లైన్ నిర్మాణ పనులతో పలు ప్యాసింజర్ రైళ్లను రైల్వే అధికారులు రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈనెల 16వ తేదీ వరకు రద్దు కొనసాగుతుందని శనివారం రైల్వే అధికారులు ఒక ప్రకటనలో వెల్లడించారు. వరంగల్ మీదుగా నడిచే కాజీపేట– డోర్నకల్ (07753), డోర్నకల్ –కాజీపేట (07754), సికింద్రాబాద్ –వరంగల్ (07463) వరంగల్–హైదరాబాద్ ప్యాసింజర్ రైళ్ల రద్దును 16 వరకు పొడిగించినట్లు తెలిపారు. ప్రయాణికులు గమనించి, సహకరించాలని కోరారు.



ఓరుగల్లు వేదిక నుంచి విజయ సంకల్పం!

కాషాయజెండా ఎగురవేయాలని పార్టీ శ్రేణులకు మోదీ దిశానిర్దేశం



విజయ సంకల్ప సభలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, బండి సంజయ్, అర్వింద్, ఈటల, లక్ష్మణ్,అరుణ, ప్రకాశ్ జవదేకర్ తదితరులు

- టార్గెట్ కేసీఆర్.. ఆయనది అవినీతి ప్రభుత్వం అంటూ ఆగ్రహం
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల తీరుపై నిప్పులు
- ఓరుగల్లుకు కదిలివచ్చిన బీజేపీ అగ్రనేతలు
- రైల్వే వ్యాగన్ తయారీ, హైవేల విస్తరణ పనులకు శంకుస్థాపన
- నగరంలో 3.15 గంటలు గడిపిన ప్రధాని
- భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు

సాక్షిప్రతినిధి, వరంగల్:

తెలంగాణలో కాషాయజెండా ఎగురవేయడమే లక్ష్యంగా భారత ప్రధాని నరేంద్రమోదీ ఓరుగల్లు వేదిక నుంచి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఆరు నూరైనా తెలంగాణలో బీజేపీ గెలవాల్సిందేనని సూచించారు. శనివారం హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన 'విజయ సంకల్పసభ'లో పాల్గొన్నారు. మోదీ వేదికపైకి చేరుకోగానే నమో నామస్మరణ మారుమోగింది. ముందుగా నాయకులు కూడా తమ ప్రసంగాల్లో మోదీని పొగిడారు. చివరగా మోదీ తన ప్రసంగంలో బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ టార్గెట్‌గా ఆరోపణాస్త్రాలు సంధించారు. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం అవినీతికి చిరునామాగా మారిందని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు దేశాన్ని, రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాయని నిప్పులు చెరిగిన ప్రధాని.. ఆ రెండు పార్టీలను పత్తా లేకుండా చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. భారతీయ జనతా పార్టీ విజయాలకు అండగా నిలిచిన ఓరుగల్లు నుంచే మార్పునకు శ్రీకారం చుడదామన్న మోదీ... పార్టీకి విజయాలను చేకూర్చడంలో గతంలోనూ ప్రజలు అండగా నిలిచారన్నారు. సుమారు 3.15 గంటల పాటు వరంగల్ నగరంలో గడిపిన ప్రధాని.. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మామునూరు ఎయిర్‌పోర్టు నుంచి హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానం వరకు.. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి మళ్లీ మామునూరు ఎయిర్‌పోర్టుకు వెళ్లే వరకు భారీ భద్రత, బందోబస్తు ఏర్పాట్లు చేసిన పోలీసులు పర్యటన ప్రశాంతంగా ముగియడంతో ఊపిరి పీల్చుకున్నారు.

- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వేదికపైకి రాగానే కార్యకర్తలు మోదీ.. మోదీ అంటూ మార్మోగేలా నినాదాలు చేశారు. ప్రధాని ప్రసంగం కొనసాగుతున్నంత సేపు ఎలాంటి నినాదాలు లేకుండా ఆసక్తిగా విన్నారు.
- ఎంపీ బండి సంజయ్ వేదికపైకి రాగానే పార్టీ శ్రేణులు కేరింతలు కొట్టారు. సీఎం.. సీఎం అంటూ నినాదాలు చేశారు. ప్రసంగిస్తున్నప్పుడు కార్యకర్తలు చప్పట్లు కొట్టారు.
- బండి సంజయ్ ప్రసంగం ఆద్యంతం మోదీని పొగుడుతూ సాగింది.
- బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ వేదికపైకి రాగానే కార్యకర్తలు ఈటల.. సీఎం.. ఈటల.. సీఎం అంటూ నినాదాలు చేశారు.
- కేసీఆర్‌ను కల్వకుంట్ల ఫ్యామిలీని విమర్శించిన ప్రతీసారి కార్యకర్తలు కేరింతలు కొట్టారు. హర్షధ్వానాలు చేశారు.
- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అతిథులను వేదికపైకి ఆహ్వానించగా, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ వందన సమర్పణ చేశారు.
- ప్రధాని 24 నిమిషాలు మాట్లాడారు.
- ఒకే గేట్ ఉండడంతో బహిరంగ సభ ముగిసిన తర్వాత బయటకు వెళ్లేందుకు సభకు వచ్చిన వారు ఇబ్బందులు పడ్డారు.
- సభికులకు తాగునీటికి ఇబ్బంది లేకుండా వలంటీర్లు వాటర్ బాటిళ్లు అందించారు. కొందరైతే వాటిని ఇంటికి తీసుకెళ్లడం కనిపించింది.

- హన్మకొండ

ఓరుగల్లు వేదికపైకి బీజేపీ అగ్రనేతలు..

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా.. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతిష్టాత్మకంగా తీసుకుని బీజేపీ నిర్వహించిన విజయసంకల్ప సభ వేదికపైకి ఆ పార్టీ అగ్రనేతలు చేరారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, శుక్రవారమే తెలంగాణ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా నియమితులైన ప్రకాశ్ జవదేకర్, తరుణ్‌చుగ్, ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, ఎంపీలు బండి సంజయ్, ధర్మపురి అర్వింద్, నాయకులు డీకే అరుణ, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఏపీ జితేందర్‌రెడ్డితో పాటు పలువురు కీలక నేతలు మోదీతో సభావేదికను పంచుకున్నారు. వేదికపైన ప్రసంగించిన నేతలు మోదీ సహా కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఈటల రాజేందర్ తదితరులు కేసీఆర్, బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లను టార్గెట్ చేశారు. తెలంగాణలో అధికారమే లక్ష్యమని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీజేపీ వ్యూహాలు రూపొందిస్తున్న తరుణంలో ఓరుగల్లు వేదికగా మోదీ అతిథిగా 'విజయ సంకల్ప' సభ నిర్వహించడం.. ఇక్కడినుంచి ఎన్నికల శంఖారావాన్ని పూరించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.



సభకు హాజరైన బీజేపీ శ్రేణులు, జనం





జై..మోదీ అంటూ నినదిస్తున్న మహిళా కార్యకర్త

ప్రాజెక్టులకు శంకుస్థాపన..



రైల్వే వ్యాగన్ తయారీ ఫ్యాక్టరీకి వర్చువల్‌లో శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ, వేదికపై గవర్నర్ తమిళిసై, కేంద్ర మంత్రులు గడ్కరీ, కిషన్‌రెడ్డి, ఎంపీ బండి సంజయ్

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం సుమారు 3.15 గంటలు ఓరుగల్లులో గడిపారు. కాజీపేట వ్యాగన్ల తయారీ పరిశ్రమ, రెండు జాతీయ రహదారుల విస్తరణ పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.

- జగిత్యాల నుంచి ఖమ్మం వరకు విస్తరించి ఉన్న (ఎన్‌హెచ్–563) రెండు వరుసలతో కూడిన రహదారి కరీంనగర్–వరంగల్ సెక్షన్ల మధ్య రూ.2,146 కోట్లతో 68 కి.మీ.ల మేర నాలుగు వరుసల విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు.
- నాగ్‌పూర్–విజయవాడ కారిడార్‌లో నిర్మిస్తున్న 163జి గ్రీన్‌ఫీల్డ్ హైవేను తెలంగాణలోని మంచిర్యాల–వరంగల్ మధ్య 108 కి.మీటర్లు నిర్మించనున్నారు. సుమారు రూ.3,404 కోట్లతో మూడు విభాగాలు విభజించి నాలుగు వరుసలతో విస్తరించే పనులకు ప్రధాని శంకుస్థాపన చేశారు.
- సుమారు మూడువేల మందికి ఉపాధి కల్పించే విధంగా రూ.520 కోట్లతో చేపట్టే ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కాజీపేట రైల్వే వ్యాగన్ల తయారీ యూనిట్‌కు శంకుస్థాపన చేశారు.



భద్రకాళి ఆలయంలో హారతి తీసుకుంటున్న మోదీ

ప్రధానమంత్రి పర్యటన సాగిందిలా...

- **10.08 గంటలకు** మామునూరు ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ప్రధాని మోదీ... ప్రకటించిన షెడ్యూల్ సమయంకంటే కొద్ది నిమిషాల ముందుగానే వచ్చారు. ఎయిర్‌పోర్టులో బీజేపీ జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులు, సీఎస్‌తోపాటు అధికారులు స్వాగతం పలికారు.
- **10.27 గంటలకు :** మామునూరు నుంచి కాన్వాయ్‌లో రోడ్డు మార్గాన భద్రకాళి ఆలయానికి ప్రయాణమయ్యారు.
- **10.38 గంటలకు :** భద్రకాళి ఆలయానికి చేరుకున్న ప్రధానమంత్రి మోదీకి అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో మోదీ జ్యోతి వెలిగించి, ప్రత్యేక పూజలు చేశారు.
- **11.05 గంటలకు :** భద్రకాళి ఆలయం నుంచి ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్‌కు బయలుదేరారు.
- **11.13 గంటలకు:** ఆర్ట్స్ కాలేజ్ మైదానంలోని సభావేదిక పైకి చేరుకున్న నరేంద్ర మోదీని కిషన్‌రెడ్డి పట్టు శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందించారు.
- **11:33 గంటలకు :** రైల్వే వ్యాగన్ల తయారీ యూనిట్, జాతీయ రహదారుల విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు.
- **11:35–11.37 గంటల వరకు :** ప్రధాని శంకుస్థాపన చేసిన పలు కార్యక్రమాలకు సంబంధించి రైల్వే, నేషనల్ హైవేస్ అధికారుల పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కొనసాగింది.
- **11.38–11:47 గంటల వరకు:** 9 నిమిషాల పాటు ప్రధాని అధికారిక ప్రసంగం.
- **11.52 గంటలకు :** అధికారిక కార్యక్రమాల శంకుస్థాపన వేదిక నుంచి పక్కనే ఉన్న 'విజయ సంకల్పసభ' వేదికపైకి చేరుకున్నారు. జ్ఞాపికల బహూకరణ, శాలువాతో సన్మానం.
- **11.55–మధ్యాహ్నం 12.21 గంటల వరకు:** కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్, బండి సంజయ్ ప్రసంగం.
- **12.22–12.47 గంటల వరకు :** విజయసంకల్ప సభ వేదిక నుంచి ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగం.
- **1.20 గంటలకు :** ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి మామునూరు ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ప్రధాని.. అధికారులు, బీజేపీ నేతల వీడ్కోలు
- **1.28 గంటలకు** హెలికాప్టర్‌లో హకీంపేటకు పయనం.

భద్రతలో వీళ్లు ప్రత్యేకం



ఈ ఫొటోలు చూడండి.. నల్లని కళ్లద్దాలు. బుల్లెట్ ప్రూఫ్ జాకెట్. చేతిలో అత్యాధునిక గన్. మోడ్రన్ రివాల్వర్. చెవిలో కమ్యూనికేషన్ డివైజ్. మోకాలికి గార్డ్.. ధరించిన వీళ్లు ఎస్పీజీ(స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్) కమాండోలు. ప్రధాని ఓరుగల్లు పర్యటనలో ప్రత్యేకంగా కనిపించారు. ప్రధాన మంత్రి, ఆయన కుటుంబసభ్యులను కంటికి రెప్పలా కాపాడడం వీరి డ్యూటీ. ఎస్పీజీ సిబ్బందిని సీఆర్‌పీఎఫ్ బలగాల నుంచి తీసుకుంటారు. ఎస్పీజీలోకి తీసుకునే ముందు సీఆర్పీఎఫ్ సిబ్బంది కుటుంబసభ్యులను, బంధు మిత్రులను విచారిస్తారు. అన్ని రకాల అర్హతలున్న వారినే ఇందులోకి తీసుకుంటారు. వీరు భద్రత విషయంలో ప్రాణాలు లెక్కచేయకుండా కాపాడతారు. - వరంగల్ క్రైం



'నమో హోరు'గల్లు
- భద్రకాళి సన్నిధిలో మోదీ
- ప్రధానికి ఘన స్వాగతం.. వీడ్కోలు

పోలీస్ దిగ్బంధంలో నగరం
- భద్రతలో దేశవ్యాప్త బలగాలు

అభివృద్ధి పేరుతో రాజకీయాలు
- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఉమ్మడి జిల్లా ఆశలు నీరుగార్చిన ప్రధాని
- ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్యే అరూరి రమేశ్

- వివరాలు 8లో

కేయూకు 'ఏ' ప్లస్ గ్రేడ్

- న్యాక్ నుంచి అధికారులకు సమాచారం
- యూనివర్సిటీలో హర్షాతిరేకాలు..
- అన్ని అంశాల్లో ప్రాధాన్యం.. కొత్త కోర్సులు ప్రవేశపెట్టుకునే అవకాశం

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీకి నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) అత్యుత్తమ 'ఏ' ప్లస్ గ్రేడ్ లభించింది. శనివారం ఆ గ్రేడ్‌ను ప్రకటించినట్లుగా యూనివర్సిటీ అధికారులకు సమాచారం అందింది. న్యాక్ 'ఏ' గ్రేడ్ కలిగిన కేయూ రీ అక్రిడిటేషన్‌కు ఈ ఏడాది మార్చిలో సెల్ఫ్ స్టడీ రిపోర్టును కేయూ ఇంటర్నల్ క్వాలిటీ సెల్ డైరెక్టర్ ద్వారా న్యాక్ అధికారులకు ప్రతిపాదించారు. న్యాక్ బృందం ఉత్తరప్రదేశ్ ఆగ్రాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ మాజీ వీసీ సుగమ్ ఆనంద్ చైర్మన్‌గా మరో ఆరుగురు సభ్యులతో కూడిన బృందం ఈ ఏడాది మే 25, 26, 27 తేదీల్లో కేయూను సందర్శించింది.

అంచెలంచెలుగా 'ఏ' ప్లస్ గ్రేడ్ వరకు

కేయూ యూనివర్సిటీకి 2003లో న్యాక్ 'బీ' ప్లస్ గ్రేడ్ లభించింది. అనంతరం 2009లో 'ఏ' గ్రేడ్ సాధించగా.. మళ్లీ 2017లో 'ఏ' గ్రేడ్ లభించింది. కాల పరిమితి ఐదేళ్ల తర్వాత గత ఏడాది సెప్టెంబర్‌తో ముగియగా కేయూ వీసీ రమేశ్, రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు న్యాక్ రీ అక్రిడిటేషన్ కోసం కొంత కాలంగా అధ్యాపకులను సిద్ధం చేశారు. ఇప్పుడు ఏకంగా న్యాక్ 'ఏ' ప్లస్ గ్రేడ్ లభించడం విశేషం. దీంతో యూనివర్సిటీ అధికారులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొందరు కాంట్రాక్టు అధ్యాపకులు శనివారం రాత్రి కేయూ మొదటిగేట్ వద్ద సంబురాలు నిర్వహించుకున్నారు. స్వీట్లు పంపిణీ చేసుకున్నారు.



కేయూలో సంబురాలు జరుపుకుంటున్న కాంట్రాక్టు అధ్యాపకులు

ఏడేళ్ల పాటు 'ఏ' ప్లస్ గ్రేడ్

ఈ 'ఏ' ప్లస్ గ్రేడ్ కాలపరిమితి ఏడేళ్ల వరకు ఉంటుంది. దీంతో ఓయూ తర్వాత తెలంగాణలో ప్రతిష్టాత్మకమైన యూనివర్సిటీగా కేయూ కొనసాగనుంది. యూనివర్సిటీకి పరిశోధనల పరంగా ప్రాజెక్టుల పరంగా యూజీసీ నుంచి , ఇతర సీఎస్ఐఆర్, డీఎస్‌టీ, డిపార్టుమెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ, రూసా తదితర ఫండింగ్ సంస్థల నుంచి నుంచి నిధులు వచ్చే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఏ ప్లస్ యూనివర్సిటీలో చదువుకొని ఇతర ఉన్నత విద్య కోర్సులకు విదేశీ యూనివర్సిటీలకు వెళ్తే ప్రాధాన్యం ఉంటుంది. ఫారిన్ యూనివర్సిటీలకు రీసెర్చ్ ఫెల్లోషిప్స్ కూడా దరఖాస్తు చేసినప్పుడు, నేషనల్ రీసెర్చ్ ఫెల్లోషిప్స్‌నకు దరఖాస్తులు చేసినప్పుడు ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. కేయూ పరిధిలోని దూర విద్యకేంద్రం కూడా ఈసారి న్యాక్ పరిధిలోకి తీసుకొచ్చారు. తొలుత అనుమతులు లేకున్నా.. కొత్త కోర్సులు ప్రవేశపెట్టుకునే వీలుంటుందని భావిస్తున్నారు.

జన హృదయనేత వైఎస్సార్

డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి

నయీంనగర్: దివంగత నేత వైఎస్.రాజశేఖరరెడ్డి జన హృదయనేత, సంక్షేమ పథకాల స్ఫూర్తి ప్రదాత అని హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా హనుమకొండ నయీంనగర్‌లోని నాయిని రాజేందర్‌రెడ్డి స్వగృహంలో డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి జయంతి నిర్వహించారు. నాయిని రాజేందర్‌రెడ్డి ఈసందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తోటం రవీందర్, పులి రాజు, ఐలయ్య, సత్యనారాయణ, రవీందర్‌రెడ్డి, జాఫర్, స్రవంతి, సంతోశ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హౌస్ అరెస్ట్

ప్రధాని పర్యటన సందర్భంగా పోలీసులు నాయిని రాజేందర్‌రెడ్డిని గృహ నిర్బంధం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్ జయంతిని పార్టీ ఆఫీస్‌లో నిర్వహించకుండా గేటుకు తాళాలు వేసి పోలీసులు అడ్డుకున్నారన్నారు.

పేదల పెన్నిధి వైఎస్సార్

వరంగల్: దివంగత నేత డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి జయంతిని శనివారం కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో హనుమకొండలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వరద రాజేశ్వర్‌రావు, నమిండ్ల శ్రీను, జన్ను రవి, మహమ్మద్ పాషా, రావుల భూపాల్‌రెడ్డి, కొమురయ్య యాదవ్, పసునూరి అనిల్, అంకెసరపు సురేందర్, మల్లం కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయిని రాజేందర్‌రెడ్డి



వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న స్వర్ణ

అభివృద్ధి పేరుతో రాజకీయాలు

● రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



హన్మకొండ: ప్రధాని మోదీ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడానికి వచ్చారా..? రాజకీయాలు చేయడానికి వచ్చారా అని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రశ్నించారు. అమెరికాలో ఉన్న మంత్రి ఎర్రబెల్లి ప్రధాని పర్యటనపై తీవ్రంగా స్పందించారు. కేవలం సీఎం కేసీఆర్‌ను తిట్టడానికి, ఇంత సమయం, అంత ఖర్చు చేసి, వరంగల్ దాకా వచ్చారా అని ఆయన ఒక ప్రకటనలో ప్రశ్నించారు. తెలంగాణకు, వరంగల్‌కు ఏం చేశారో చెప్పకుండా కేసీఆర్‌ను ఎలా విమర్శిస్తారని పేర్కొన్నారు. 2014లో ప్రధాని పదవి చేపట్టిన మోదీ మొదటి నుంచి తెలంగాణపై విషాన్ని, విద్వేషాన్ని చిమ్ముతున్నారని విమర్శించారు. కాజీపేటకు రిపేరు ఫ్యాక్టరీ ఇచ్చి, గుజరాత్‌లోని దహోద్‌లో రూ.20వేల కోట్లతో లోకోమోటివ్ ఫ్యాక్టరీ పెట్టుకుంటారా అని నిలదీశారు. విభజన చట్టంలోని హామీ కోచ్ ఫ్యాక్టరీకి మొండిచేయి చూపారని విమర్శించారు. బీజేపీ అంటేనే బడా ధోకా పార్టీ అని, ప్రజలకు మీరు ఏమి చేశారో తెలుసని, మీకు ఈడీలు, సీబీఐలు అండగా ఉంటే మాకు తెలంగాణ ప్రజలు అండగా ఉన్నారని తెలిపారు. భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న మోదీ ఆ ఆలయానికి ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు.

ప్రధానికి వ్యతిరేకంగా ఫ్లెక్సీలు

● విభజన హామీలు నెరవేర్చాలని ప్రశ్నలు



లతారెడ్డి పేరుతో ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన ఫొటో

ఖిలా వరంగల్: వరంగల్ పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీకి నిరసన ఎదురైంది. విభజన హామీలు నెరవేర్చాలని ప్రశ్నిస్తూ వరంగల్ –ఖమ్మం జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన విభజన హామీలు నెరవేర్చాలని ఫ్లెక్సీలో పేర్కొన్నారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ ఏమైంది మోదీ..?, గిరిజన విశ్వవిద్యాలయం ఏదీ..?, బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏమైంది..? రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, ఐటీఐఆర్ ఏమయ్యాయని ప్రశ్నిస్తూ ఫ్లెక్సీలను రహదారిపై ఏర్పాటు చేయగా.. వీటికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. అయితే ప్రధాని మోదీని ప్రశ్నిస్తున్నట్లుగా రహదారులపై ఏర్పాటు చేసిన ఈ ఫ్లెక్సీలు శనివారం ఉదయం కన్పించకపోడం గమనార్హం. పోలీసులు, లేదా బీజేపీ నేతలు ఉదయాన్నే తొలగించి ఉంటారని అంతా భావిస్తున్నారు. కానీ, ఈ ఫ్లెక్సీలకు సంబంధించిన ఫొటోలు లతారెడ్డి అనే మహిళ పేరుతో ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. దీంతో లతారెడ్డి ఎవరు.. ఈ ఫ్లెక్సీలకు ఆమెకు సంబంధం ఏమిటని పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. రహదారిపై ఫ్లెక్సీల వ్యవహారంపై మామునూరు పోలీసులను వివరణ కోరగా తమ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేయలేదని ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ స్పష్టం చేశారు. దీంతో ఫ్లెక్సీలు ఎక్కడ ఏర్పాటు చేశారు.. ఎవరు ఏర్పాటు చేశారనే విషయంపై స్పష్టత లేకుండా పోయింది.

ఉమ్మడి జిల్లా ఆశలు నీరుగార్చిన ప్రధాని

● రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్ భాస్కర్



మాట్లాడుతున్న వినయ్ భాస్కర్, పక్కన ఎంపీ, ఎమ్మెల్యే

హన్మకొండ: భద్రకాళి అమ్మవారి ఆశీర్వాదం తీసుకుని ప్రధాని మోదీ అపవిత్రమైన మాటలు మాట్లాడారని, ఉమ్మడి వరంగల్ ప్రజల ఆశలు నీరుగార్చారని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ విమర్శించారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వినయ్‌భాస్కర్ మాట్లాడారు. సీఎం కేసీఆర్ తెలంగాణను అభివృద్ధి చేయలేదని చెప్పడం కంటే పెద్ద అబద్ధం ఏమైనా ఉంటుందా అని ప్రశ్నించారు. ప్రధాని మోదీ పర్యటన బీజేపీని పటిష్టం చేసేందుకు, పార్టీలోని గ్రూపులను కట్టడి చేసేందుకు వచ్చినట్లుగా ఉందని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. రాష్ట్ర విభజన చట్టంలోని హామీలపై స్పష్టత ఇవ్వలేదని దుయ్యబట్టారు. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఎందుకు ఏర్పాటు చేయరని ప్రశ్నించారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్ మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రసంగంలో పస లేదని విమర్శించారు. భద్రకాళి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్న మోదీ హుండీలో ఒక్క రూపాయి కూడా వేయలేదన్నారు. రాష్ట్రంలో అవినీతి జరుగుతుందని చెబుతున్న ప్రధాని మోదీ కేంద్రంలో అధికారంలో ఉండి ఎందుకు నిరూపించలేకపోతున్నారని ప్రశ్నించారు. సమావేశంలో ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజు యాదవ్, నాయకులు పులి రజనీకాంత్, శ్రీధర్, అశోక్ పాల్గొన్నారు.



హెలికాప్టర్ దిగుతున్న ప్రధాని నరేంద్ర మోదీ





ప్రధానికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, సెల్యూట్ చేస్తున్న సీపీ ఏ.వీ. రంగనాథ్

నమో హోరుగల్లు..

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటనతో శనివారం ఓరుగల్లు నగరం నమో నినాదాలతో హోరెత్తింది. పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి ప్రత్యేక హెలికాప్టర్‌లో వచ్చిన ప్రధాని.. నగర శివారులోని మామునూరు ఎయిర్‌పోర్ట్‌లో దిగి.. అక్కడి నుంచి చారిత్రాత్మక భద్రకాళీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కట్టుదిట్టమైన బందోబస్తు నడుమ హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానానికి చేరుకుని అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి, సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా దారిపొడవునా ప్రజలు, బీజేపీ శ్రేణులు నమో.. నమో అంటూ చేసిన నినాదాలతో నగరం మార్మోగింది. సుమారు మూడున్నర గంటల పర్యటన అనంతరం మామునూరు ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రధాని తిరుగుపయనమయ్యారు.

మోదీకి ఘనస్వాగతం.. వీడ్కోలు



ప్రధాని మోదీకి వీడ్కోలు పలుకుతున్న కిషన్‌రెడ్డి, గవర్నర్

మామునూరు: ప్రధాని నరేంద్ర మోదీ ఖిలావరంగల్ మండలం మామునూరులోని నిజాంకాలం నాటి విమానాశ్రయానికి శనివారం ఉదయం 10.10 గంటలకు వ్యక్తిగత భద్రత సిబ్బందితో చేరుకున్నారు. గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర్‌రాజన్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, ఎస్‌పీజీ డీఐజీ నవనీత్‌కుమార్, సీపీ ఏవీ రంగనాథ్, బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లాడి తిరుపతిరెడ్డి, జలగం రంజిత్, కుసుమ సతీష్, గంట రవికుమార్, డాక్టర్ వెంకటరమణ మోదీకి ఘనంగా స్వాగతం పలికారు. మోదీ హెలికాప్టర్ దిగగానే వారు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు మోదీకి సీపీ రంగనాథ్ గౌరవ వందనం సమర్పించారు. మోదీ భద్రత సిబ్బందితో ప్రత్యేక బుల్లెట్‌ప్రూఫ్ వాహనంలో రోడ్డు మార్గం ద్వారా భద్రకాళి ఆలయానికి బయల్దేరారు. అనంతరం హనుమకొండ ఆర్ట్స్ సైన్స్ కళాశాల సభా స్థలం నుంచి నేరుగా విమానాశ్రయానికి మధ్యాహ్నం 1.20 చేరుకుని 1.28 నిమిషాలకు హెలికాప్టర్‌లో తిరిగి హైదరాబాద్ హకీంపేట ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లిపోయారు. మోదీకి సీపీ రంగనాథ్, కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, జిల్లా పార్టీ శ్రేణులు ఘనంగా వీడ్కోలు పలికారు.

ఎయిర్‌పోర్ట్‌లో భారీ బందోబస్తు..

శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సీపీ రంగనాథ్ పర్యవేక్షణలో డీసీపీ భారీ నేతృత్వంలో శనివారం ఎస్‌పీజీ, ఎన్‌సీజీ, టీఎస్‌ఎస్పీ బలగాలు, మామునూరు ఏసీపీ కృపాకర్, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, క్రాంతికుమార్, 12 మంది ఎస్సైలు, 100 మంది కానిస్టేబుళ్లు భద్రత కల్పించారు. అంతకు ముందు విమానాశ్రయానికి ఎస్‌పీజీ, ఎన్‌సీజీ బలగాలు, బాంబు, డాగ్ స్క్వాడ్ చేరుకుని ఎయిర్‌పోర్ట్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. శుక్రవారం సాయంత్రం నుంచే మామునూరు ఎయిర్‌పోర్ట్‌ను ఎస్‌పీజీ అధికారులు స్వాధీనం చేసుకుని భారీ బందోబస్తు నిర్వహించారు.

30 ఏళ్ల తర్వాత వరంగల్‌కు ప్రధాని..

30 ఏళ్ల తర్వాత వరంగల్‌కు ప్రధాని చేరుకున్నారు. చాలా ఏళ్ల తర్వాత మామునూరు విమానాశ్రయంలో మూడు హెలికాప్టర్లు ల్యాండ్ అయ్యాయి. దీంతో వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై ఇరువైపులా పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజలు చేరుకుని అతిదగ్గరగా మోదీని తిలకించారు.

బండి సంజయ్ భావోద్వేగ ప్రసంగం

● ఆప్యాయంగా చేతులు పట్టుకున్న ప్రధాని మోదీ



మోదీని సన్మానిస్తున్న ఎంపీ బండి సంజయ్

హన్మకొండ: హనుమకొండలో జరిగిన బీజేపీ బహిరంగ సభలో బీజేపీ రాష్ట్ర తాజా మాజీ అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ భావోద్వేగ ప్రసంగం చేశారు. పార్టీ జెండా భుజాన మోసిన తనకు పార్టీ ఎన్నో అవకాశాలు ఇచ్చిందని, కార్పొరేటర్, ఎంపీ, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా అవకాశం కల్పించిందని భావోద్వేగానికి గురయ్యారు. అంతకు ముందు ప్రధాని మోదీ బహిరంగ సభ వేదికపైకి రాగానే ముందుగా కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జ్ఞాపిక అందించి శాలువా కప్పి స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ బండి సంజయ్ శాలువా కప్పి రెండు చేతులతో నమస్కరించగా ప్రధాని మోదీ.. ఎంపీ బండి సంజయ్ రెండు చేతులను ఆప్యాయంగా పట్టుకుని మాట్లాడారు.

ప్రధానితో జితేందర్‌రెడ్డి మాటామంతి..



ప్రధాని మోదీతో ముచ్చటిస్తున్న జితేందర్‌రెడ్డి

బీజేపీ నిర్వహించిన బహిరంగ సభలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ.జితేందర్ రెడ్డి ముచ్చటించడాన్ని నాయకులు, కార్యకర్తలు ఆసక్తిగా గమనించారు. సభలో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్ రెడ్డి ప్రసంగిస్తున్న క్రమంలో ప్రధాని మోదీ వద్దకు జితేందర్ రెడ్డి చేరుకుని పక్కనే కూర్చుని కొద్ది సేపు ముచ్చటించారు. కొంత కాలంగా జితేందర్ రెడ్డి వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదమవుతోంది. ఆయన చేసిన ట్వీట్లు చర్చనీయాంశమయ్యాయి. అనంతరం ఈటలతో సమావేశమవడంపై రకరకాలుగా చర్చలు జరిగాయి. జితేందర్‌రెడ్డి ముచ్చటిస్తున్న సందర్భంగా ప్రధాని మోదీ రెండు చేతులతో దండం పెట్టడం.. జితేందర్ రెడ్డి మాట్లాడడాన్ని అసౌకర్యంగా భావించారా..? అని చర్చించుకుంటున్నారు.

భద్రకాళి సన్నిధిలో ప్రధాని



భద్రకాళి ఆలయంలో ప్రదక్షిణ చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

హన్మకొండ కల్చరల్: నగర పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ శనివారం భద్రకాళి దేవాలయాన్ని సందర్శించారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ నుంచి ఆయన నేరుగా దేవాలయానికి చేరుకున్నారు. దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్, డీసీ శ్రీకాంతారావు, దేవాలయ ఈఓ శేషుభారతి, ప్రధానార్చకుడు భద్రకాళి శేషు, అర్చకులు పూర్ణకుంభం, మేళతాళాలతో మోదీని ఘనంగా స్వాగతించారు. ప్రధాని ముందుగా ఆలయ ఆవరణలో ఉన్న గోశాలలోని గోవులకు గ్రాసం తినిపించారు. ఆదిశంకరులు, వల్లభ గణపతిని దర్శించుకున్నారు. అనంతరం దేవాలయంలోని ధ్వజస్తంభం వద్ద జ్యోతి వెలిగించారు. అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకున్నారు. గర్భాలయంలో పూలమాలలతో శోభాయమానంగా అలంకరించిన అమ్మవారి మూర్తికి నమస్కరించి సన్నిధిలో పూజకు కూర్చున్నారు. అర్చకులు ప్రధాని మోదీ గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు. శ్రీభద్రేశ్వరస్వామి గర్భాలయంలో స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఈఓ, కమిషనర్ ప్రధానికి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. దేవాలయం నుంచి మోదీ 11 గంటలకు ఆర్ట్స్ కళాశాలకు బయలుదేరారు. అనంతరం తెలంగాణ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి దేవాలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికా రులు ఆమెకు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత, ఆలయ పర్యవేక్షకులు అద్దంకి విజయ్‌కుమార్, హరినాథ్, శ్యామ్‌సుందర్, సిబ్బంది పాల్గొన్నారు.



సభావేదికపై నృత్యం చేస్తున్న కళాకారులు



మోదీ మాస్క్‌లతో సభకు వస్తున్న బీజేపీ కార్యకర్తలు



సభకు బోనాలతో వస్తున్న మహిళలు, నాయకులు



నగరంలో ప్రధాని మోదీ కాన్వాయ్



ప్రధాని మోదీకి జ్ఞాపిక అందజేస్తున్న కిషన్‌రెడ్డి, లక్ష్మణ్



సీఎస్‌కు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న అధికారులు

పోలీస్ దిగ్బంధంలో నగరం

బందోబస్తు సక్సెస్

● పీఎం టూర్‌లో కట్టుదిట్టంగా మూడంచెల భద్రత అమలు

వరంగల్ క్రైం : హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో శనివారం నిర్వహించిన ప్రధాని నరేంద్ర మోదీ విజయసంకల్ప సభకు పోలీసులు చేపట్టిన బందోబస్తు విజయవంతమైంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అడుగడుగునా పోలీసులతో పహారా చేయించి, బందోబస్తును విజయవంతం చేశారు. రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్‌తోపాటు లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీపీ సంజయ్‌కుమార్ జైన్, గ్రేహౌండ్ అడిషనల్ డీజీపీ విజయ్‌కుమార్‌లతోపాటు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏ.వీ రంగనాథ్ ప్రత్యక్షంగా బందోబస్తు విధుల్లో పాల్గొన్నారు. మామునూర్ హెలిపాడ్ వద్ద అడిషనల్ డీజీపీ సంజయ్‌కుమార్ జైన్, సీపీ రంగనాథ్ ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి స్వాగతం పలికారు. మామునూరు హెలిపాడ్ నుంచి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానం వరకు అడుగడుగునా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ప్రధాని భద్రత కోసం మూడంచెల భద్రతను పకడ్బందీగా అమలు చేశారు.

మైక్రో సర్వే.. బోట్ పెట్రోలింగ్..

ప్రధాని మోదీ టూర్ షెడ్యూల్ ప్రకటన తర్వాత వరంగల్ కమిషనరేట్ పోలీసులు కట్టుదిట్టమైన భద్రత కల్పించడం కోసం మామునూర్ ఎయిర్‌పోర్టు స్థలం నుంచి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వరకు ప్రధాన మంత్రి పర్యటించే రోడ్డు మార్గం రానుపోను 32 కిలోమీటర్లకు రెండు వైపుల ఇళ్లు, వాణిజ్య సముదాయాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, అపార్ట్‌మెంట్లు ఇలా అన్ని అంశాల్లో పనిచేస్తున్నవారు, నివాసిస్తున్నవారిని ఫొటోలు, వీడియోలు తీసి సూక్ష్మ స్థాయిలో వివరాలు సేకరించారు. ప్రధాని పర్యటనకు మూడు రోజుల ముందు వరంగల్ కమిషనరేట్ పోలీసులు, ప్రత్యేక విభాగం (ఎస్‌బీ) అధికారులు తయారు చేసిన అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ (ఏఎస్‌ఎల్) నివేదికను ఎస్పీజీ డైరెక్టర్, ఐబీ డైరెక్టర్లకు పంపించారు. మైక్రో సర్వేతో పాటు సోషియో ఎకానమీ, సెన్సెక్స్ సర్వే చేయించారు. భద్రకాళీ ఆలయంలో పనిచేసే పూజారులు, అధికారులు, ఆలయ సిబ్బందితోపాటు వారి కుటుంబ సభ్యుల పూర్తి వివరాలను ఎస్‌బీ అధికారులు సేకరించారు. భద్రకాళీ చెరువులో ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది సుమారు 48 గంటల పాటు బోట్ పెట్రోలింగ్ నిర్వహించారు.



ఆర్ట్స్ కళాశాల ఎదుట మోహరించిన పోలీసుబలగాలు

బందోబస్తులో పాల్గొన్న బలగాలు

విజయసంకల్ప సభ బందోబస్తులో దేశ వ్యాప్తంగా ఉన్న వివిధ రకాల పోలీస్ బలగాలు పాల్గొన్నాయి. ఎస్పీజీ, పారామిలటరీ బలగాలు, లోకల్ పోలీసులతో మూడంచెల భద్రతతోపాటు యాంటీ డ్రోన్ టీమ్స్, నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ (ఎన్‌ఎస్‌జీ), కెమికల్, బయోలజీ, రేడియాలజీ, న్యూక్లియర్ (సీబీఆర్‌ఎస్), ఇండియన్ ఎన్విరాన్‌మెంటల్ రేడియేషన్ మానిటర్ (ఐఈఆర్‌ఎం), యాంటీ సబ్‌టైడ్ చెక్ టీం (ఏఎస్‌సీటీ), ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజెస్ (ఐఈడీ), క్లోజ్ ప్రాక్స్‌మెట్ టీం(సీపీటీ), బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్స్(బీడీఎస్), రోడ్ ఓపెనింగ్ పార్టీస్ (ఆర్‌ఓపీ), ఏరియా డామినేషన్ పార్టీస్ (ఏడీపీ), ఐబీ, ఎఎస్ఎల్, గ్రేహౌండ్, ఎన్డీఆర్‌ఎఫ్, ఇతర బృందాలతోపాటు రాష్ట్రంలోని పోలీస్ సిబ్బంది సుమారు 3,500 మంది బందోబస్తులో పాల్గొన్నారు.

నగరంలో నిఘా

వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్ ఆదేశాలు.. స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ తిరుమల్ పర్యవేక్షణలో వారం రోజుల పాటు ప్రధాని పర్యటించే అన్ని ప్రాంతాలు నిఘా నీడలో కొనసాగాయి. ఏరియా డామినేషన్ పార్టీస్‌తో కొన్ని ప్రాంతాల్లో పోలీసులు జల్లెడ పట్టారు. ప్రధాని కాన్వాయ్ ప్రయాణించే రోడ్డుకు ఇరువైపులా ఉండే ప్రతి ఒక్కరిని పరిశీలించారు. మోదీ ఇంతకుముందుకు పర్యటించిన ప్రాంతాల్లో పోలీసులు అనుసరించిన విధానాలను పరిశీలించి ఇక్కడ అమలు చేశారు.